విశాలాంధ్ర
తిరుపతి జిల్లా
చిత్తూరు జిల్లా
మంగళవారం 11 ఫిబ్రవరి 2025
8 పేజీలు

జిల్లా ఎస్పీ ఆదేశాలతో 'విశాలాంధ్ర' బుక్ షాప్‌పై దాడి చేసిన

మతోన్మాదులపై కేసు నమోదు

వార్త మెయిన్‌లో

ఇల్లు లేని నిరుపేదలకు తక్షణమే ఇంటి స్థలాలు చూపించాలి

- కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీని నెరవేర్చాలి
- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ. రామానాయుడు డిమాండ్
- ఇళ్ల స్థలాల కోసం సిపిఐ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేసి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు పిలుపు ఇచ్చారు. సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు తిరుపతి అర్బన్ రూరల్ ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఇల్లు లేని నిరుపేదలతో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఎ.రామానాయుడు మాట్లాడుతూ ఇళ్ల స్థలాల లబ్ధిదారుల్లో 90శాతం దళితులు, గిరిజనులు, మైనార్టీలు, వెనుకబడిన తరగతుల వారే ఉన్నారని తెలిపారు. గతంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి ఒక్క సెంటు స్థలం కేటాయించి, ఇంటి నిర్మాణానికి లక్షా ఎనభ్కైవేలు మాత్రమే ఇచ్చిందన్నారు. చాలా చోట్ల ఇళ్ల స్థలాల లే అవుట్లు అసంపూర్తిగా ఉన్నాయని, కొన్ని ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిందన్నారు. ఇళ్లు లేక పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తిరుపతి అర్బన్ రూరల్ ప్రాంతాలలో 30 వేలకు పైగా ఇంటి పట్టాలు మంజూరు చేశారని, తిరుపతి నగరానికి 35 కిలోమీటర్లు దూరంలో ఇల్లే కేటాయించారని అక్కడ నివాసయోగ్యంగా ఉన్న ప్రాంతాలలో ఇల్లు కట్టుకోలేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం తక్షణమే ప్రజలకు అనుగుణంగా లేనటువంటి ప్రభుత్వ లేఔట్లను రద్దుచేసి తిరపతి దగ్గరగా ఉన్న ప్రభుత్వ భూములలో ఇంటి స్థలాలు చూపించాలని పిలుపునిచ్చారు. తిరపతి నగరంలో ఇచ్చిన పట్టాల రద్దు చేయకపోతే కొత్తగా అప్లై చేసుకోవాలంటే ఆన్లైన్లో ఇల్లు కేటాయించబడిందని చూపిస్తున్న గనుక అనేక సమస్యలు ఎదురయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. తిరుపతిని సీఎం గారు ప్రత్యేక దృష్టి కేటాయించి లేఅవుట్ల పరిశీలించి తక్షణమే వాటి రద్దు చేయాలని అక్కడ జరిగిన అక్రమాల పైన కూడా విచారణ చేపట్టాలని పిలుపునిచ్చారు. ఇసుక, ఇటుక, ఇనుము, కంకర ధరలు పెరిగిన కారణంగా ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు నివాస స్థలాలు కేటాయించాలని కోరారు. పేదలకు ఇళ్ల స్థలాల సాధన కోసం సీపీఐ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్ళకు సంబంధించి వైసీపీ ప్రభుత్వం కంట్రాక్టర్లకు

2లో,

ఎర్రజెండా నీడన ఉంటేనే పీడిత వర్గాలకు న్యాయం

- సిపిఐ తిరుపతి జిల్లా కార్యదర్శి పి.మురళి

శ్రీకాళహస్తిలో : సాధారణ ఎన్నికల సందర్భంగా ఎన్డీయే కూటమి ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు పోరాటం చేస్తామని భారత కమ్యూనిస్టు పార్టీ తిరుపతి జిల్లా కార్యదర్శి పి.మురళి ప్రకటించారు. ఎర్రజెండా నీడన ఉంటేనే పీడిత వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండు చేస్తూ శ్రీకాళహస్తి రూరల్ ఎమ్మార్వో కార్యాలయం ఎదుట సోమవారం ఉదయం 11 గంటలకు సీపీఐ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసనకు వందలాది మంది పేదలు తరలి వచ్చారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇల్లు లేని పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలం ఇవ్వాలన్నారు. ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు నిధులు ఇవ్వడంతో పాటు... నిర్మాణ బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలన్నారు. ఈ డిమాండ్ సీపీఐ మాట కాదని... సాధారణ ఎన్నికల సందర్భంగా నాటి ప్రతిపక్ష నేత, నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ అని రామకృష్ణ గుర్తు చేశారు. చంద్రబాబు చెప్పిందే తాము అడుగుతున్నాం తప్ప... కొత్తగా ఏమీ అడగడం లేదన్నారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశ్యంతోనే రాష్ట్రంలోని తిరుపతి జిల్లాలో జిల్లాల్లో ఈ నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. పేదలందరికీ

2లో

వినూత్నంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- శాఖలవారీగా అర్జీలు స్వీకరణ

విశాలాంధ్ర- చిత్తూరు: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వ హించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ సునీల్ కుమార్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యల

2లో

... పుస్తకంపై ...

దాడిని ఖండించండి

తిరుపతిలో నేడు
పుస్తక ప్రియుల ప్రదర్శన

విశాలాంధ్ర -తిరుపతి : తిరుపతిలో జరిగిన పుస్తక ప్రదర్శనపై శనివారం రాత్రి మతోన్మాదులు చేసిన దాడిని ఖండిస్తూ, మత సామరస్యాన్ని కోరుతూ, ఆ దాడికి నిరస నగా తిరుపతిలో మంగళవారం సాయంత్రం ప్రదర్శన నిర్వహించదలిచాం. తిరుపతి పుస్తక ప్రియుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు బాలాజీ కాలనీ వద్ద నున్న పూలే విగ్రహం నుంచి, నాలుగు కాళ్ళ మండపం వరకు ఈ ప్రదర్శన జరుగు తుంది. ఏ ఆలోచననూ నిషేధించలేమని, అలా నిషేదిస్తే మానవ

2లో

ముక్కంటి బ్రహ్మోత్సవాలకు

ముఖ్యమంత్రికి ఆహ్వానం

వార్త 2వ పేజీలో

మతోన్మాదులపై కేసు నమోదు

(మొదటి పేజీ తరువాయి) తిరుపతి వేదికల సమాఖ్య తరపున పట్టణంలోని పలువురు మేధావులు, ప్రజాసంఘాల నాయకులు జిల్లా ఎస్పీని కలిసి పుస్తకాలయాలపై జరుగుతున్న దాడులు గురించి, తిరుపతి నగరాన్ని కేంద్రంగా చేసుకొని జరుగుతున్న అసత్య ప్రచారాల గురించి ఆయన దృష్టికి తీసుకురావడం జరిగింది. తిరుపతిలో జరిగిన అసత్య ప్రచారాల ఘటనలను, పుస్తకాలపై జరిగిన దాడి వీడియోలు ఎస్పీ సావధానంగా తిలకించి సున్నితమైన తిరుపతిలో ఇటువంటి చర్యలను సహించమని అప్పటికప్పుడే తిరుపతి ఈస్ట్ డిఎస్పీకి తగిన విధంగా ఆదేశాలిచ్చి కేసు నమోదు చేయమని ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు ఐక్యవేదిక నాయకులు తిరుపతిలో జరిగిన ఘటనలను వివరించారు. ఆమె తీవ్రతను గుర్తించి వెంటనే అలిపిరి ఎస్సై నాగార్జున రెడ్డికి ఆదేశాలు జారీ చేసి కేసు నమోదు చేయమని ఉత్తర్వులు ఇచ్చారు. ఆ మేరకు బాధితులైన విశాలాంధ్ర బుక్ హౌస్ సి.శంకరయ్యని విచారించి కేసు నమోదు చేయడం జరిగింది. సమస్యపై చొరవ తీసుకొని వెంటనే స్పందించిన ఎస్పీ కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ తిరుపతి నగరాన్ని ప్రశాంతంగా ఉంచడం కోసం ఎస్పీ చేస్తున్న కృషికి ధన్యవాదాలు తెలిపారు. పుస్తకాన్ని బతికించుకుందాం ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం అని తెలియజేస్తూ రేపటి రోజున జరిగే ప్రదర్శనకు ప్రజలందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు పి అంజయ్య, రాఘవ, వాకా ప్రసాద్, పరమేశ్వర్, ఓ వెంకటరమణ, అజీమ్ భాష, రామానాయుడు, వందవాసి నాగరాజు, విశ్వనాథం, హరీష్, సాయి లక్ష్మి ,హేమలత, జయంతి, కే వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే ఇంటి స్థలాలు చూపించాలి

(మొదటి పేజీ తరువాయి) డబ్బులు చెల్లించని కారణంగా ఇల్లను లబ్ధిదారులకు కేటాయించలేదన్నారు. బ్యాంకు రుణాలు తీసుకున్న కారణంగా ఇంటిలోకి వెళ్లకుండానే బ్యాంకు యాజమాన్యం నుంచి రుణాలు చెల్లించాలంటూ లబ్ధిదారులకు డిమాండ్ నోటీసులు వస్తున్నాయని చెప్పారు. అనంతరం తిరుపతి రూరల్ ఎంఆర్ఓ గారికి, తిరుపత అర్బన్ డిప్యూటీ తాసిల్దార్ గారికి అర్జీలు ఇవ్వడం జరిగింది. వారు మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్,నగర కార్యవర్గ సభ్యులు ఎన్ డి రవి, పద్మనాభరెడ్డి, ఎన్ శివ, శ్రీరాములు, రత్నమ్మకే వై రాజ,రామక్రిష్ణ,గోవిందుస్వామి విజయమ్మ, మునీశ్వర్, లక్ష్మి, ఆర్వి రమేష్, అల్లా భాషా, ప్రమీల, రామమూర్తి, పూర్ణ, విక్రమ్, అలివేలమ్మ, రామచంద్ర,విజయ,అలివేలు అర్జీదారులు పాల్గొన్నారు.

ఎర్రజెండా నీడన ఉంటేనే పేదిత వర్గాలకు న్యాయం

(మొదటి పేజీ తరువాయి) ఇళ్ల స్థలాలు వస్తాయని పి.మురళి ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం వద్దే ఇళ్ల నిర్మాణం చేయిస్తామన్నారు. ప్రభుత్వం వద్ద నిధులకు కొరత లేదని... బడ్జెట్ సైతం రూ.2.94లక్షల కోట్లు కేటాయించారన్నారు. ఇంటి స్థలాలు ఇచ్చిన తరువాత మిగతా హామీలపై ప్రభుత్వాన్ని నిలదీద్దామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, అర్హులైన మహిళలకు నెలకు రూ.1,500 వంతున ఆర్థిక సాయం చేస్తామని చంద్రబాబు ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారని... ఆయన అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటుతున్నప్పటికీ హామీలు అమలు చేయలేదన్నారు. చంద్రబాబు మాట తప్పడం మామూలేనని సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి విమర్శించారు. ఈ హామీలన్నీ నెరవేర్చాలని ఆయన డిమాండు చేశారు. చంద్రబాబునాయుడు అధికారంలో లేనపుడు ఒకమాట... అధికారంలోకి వచ్చాక ఒకమాట చెబుతారన్నారు. ఏమైనా నిలదీస్తే నిధులు లేవని... వైసీపీ హయాంలో జగన్ ప్రభుత్వ ఖజానా ఖాళీ చేశారని చంద్రబాబునాయుడు చెబుతున్నారన్నారు. ఖజానా విషయం తమకు తెలియదని... ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. ఇక ఇళ్ల స్థలాలు సాధించే వరకు ఎర్రజెండా వదలకూడదని ఆయన పేదలకు పిలుపునిచ్చారు. జగన్ హయాంలో పట్టణ ప్రాంతాల్లో ఒక సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో ఒకటన్నర సెంటు వంతున ఇచ్చిన స్థలాలు ఎందుకు కొరగాకుండా పోయాయన్నారు. ఎన్డీయే కూటమి ఎన్నికల హామీ మేరకు పేదలకు గ్రామీణ ప్రాంతాల్లోమూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు వంతున స్థలాలు ఇవ్వాలన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండు చేశారు. ఎన్డీయే కూటమి ఇచ్చిన హామీ గుర్తు చేయడానికే ఈ నిరసన చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే గ్రామ, వార్డు సచివాలయాలు, మండల స్థాయిల్లో ఇంతకు మునుపే పేదలచే వినతిపత్రాలు అధికారులకు ఇచ్చామన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు నిరంతరం పోరాటం చేయాల్సి ఉందన్నారు. పోరాటం చేస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. శ్రీకాళహస్తిలో వివిధ వర్గాలకు చెందిన పేదలు సుమారు లక్ష కుటుంబాల వరకు ఉన్నారని... వీరందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. ఈ వర్గాల పేదలు ఇల్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి స్థలాల విషయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చేందుకే ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వమే రూ.5లక్షలు ఇవ్వాలని మురళి డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల కార్యదర్శి ఎం.శివకుమార్, శ్రీకాళహస్తి పట్టణ కార్యదర్శి గోపి, ఏఐటీయూసీ నాయకులు మురళి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు చార్లత, వెంకటయ్య, రాజయ్య, మణీ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కార వేదిక

(మొదటి పేజీ తరువాయి) పరి ష్కారం కోసం వచ్చే అర్జీదారుల సౌకర్యార్థం మార్పులు చేపట్టారు. ప్రతి సోమవారం జిల్లా సచివాల యంలోని స్పందన కార్యాల యంలో పలు సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజల వద్ద నుంచి జిల్లా కలెక్టర్ జిల్లా జాయింట్ కలెక్టర్లు తోపాటు డిఆర్ఓలు నేరుగా అర్జీలను స్వీకరించడం జరిగేది, దీంతో వివిధ శాఖలకు సంబం ధించి అర్జీలను జిల్లా కలెక్టర్ జెసిలు తిరిగి ఆ శాఖ అధికారుల కు పంపడం జరిగేది. దీంతో సమయం వృధాగా అవ్వడంతో పాటు అర్జీల పరిష్కారంలో కొంత జాప్యం జరిగేది. ఇలాంటివి చోటు చేసుకోకుండా తక్షణమే ప్రజా సమస్యలు పరిష్కరించాలన్న ఉద్దేశంతో అర్జీల స్వీకరణ సంబంధించి జిల్లా కలెక్టర్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇకపై ఏ శాఖ సంబంధించి అర్జీలను దానికి సంబంధించి ఉన్నత అధికారులు నేరుగా అర్జీదాల నుంచి అర్జీలను స్వీకరించి అక్కడే పరిష్కరించే విధంగా మార్పులు చేశారు. ఇందుకోసం స్పందన కార్యాల యంలో ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా స్పం దన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భూ సమస్యల సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్న నేపథ్యంలో జిల్లా సచివాలయంలో ఉన్న రెవెన్యూ అధికారులను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యే విధంగా చర్యలు చేపట్టారు. భూ సమస్య ఏది వచ్చిన నేరుగా జిల్లా సచివాలయం సంబంధించి అధికారులను ముందుగా అర్జీదారులు సంప్రదించాల్సి ఉంది. ఇందుకోసం ప్రత్యేకంగా 10 టేబుల్ లను ఏర్పాటు చేశారు. అలాగే వైద్య విద్య ఇతర శాఖ సంబంధించి అధికారులకు ప్రత్యేకంగా విభాగాలను ఏర్పాటు చేశారు. ఇందుకోసం ప్రత్యేకౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగింది. గతంలో కలెక్టర్ కార్యాలయం వద్ద అర్జీదారులు డాక్యుమెంట్ రైటర్స్ వద్ద అర్జీలను రాసుకొచ్చి కలెక్టర్ కార్యాలయంలో అందజేసేవారు. దీనికోసం అర్జీదారుల నుంచి ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేసేవారు. ఈ విషయాన్ని గుర్తించిన జిల్లా కలెక్టర్ ఇందుకోసం సచివాలయ సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. సోమవారం గ్రీవెన్స్ కొచ్చే ప్రజలకు అర్జీలను సచివాలయ సిబ్బంది రాసిచ్చే విధంగా ఏర్పాటు చేశారు. ఈ అర్జీలు పైనే సమస్యకు సంబంధించి శాఖలను కూడా పొందుపరచాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అర్జీదారులు నేరుగా సంబంధిత శాఖ అధికారుల వద్దకు నేరుగా వచ్చి అర్జీని సమర్పించాలని సూచించారు. దీంతో ఆ సమస్యను అక్కడికక్కడే పరిష్కరించే విధంగా సంబంధిత విశాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. అలాగే జిల్లా నలుమూలల నుంచి వచ్చే అర్జీదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వరుస క్రమంలో అధికారులను కలిసే విధంగా ఏర్పాటు చేశారు. ఇందుకోసం జిల్లా సచివాలయంలో పనిచేసే వివిధ శాఖల కిందిస్థాయి సిబ్బంది సేవలను వినియోగించుకున్నారు. అలాగే తోపులాటలు జరగకుండా అదనంగా పోలీసు సిబ్బందిని సైతం నియమించారు. జిల్లాస్థాయి అధికారుల పరిధిలోని లేని సమస్యలను జిల్లా కలెక్టర్ పరిశీలించే విధంగా ఏర్పాటు చేశారు.

ముఖ్యమంత్రికి ఆహ్వానం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 21వ తేదీ వచ్చే నెల 6వ తేదీ వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. విజయవాడలో సోమవారం శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో నారా చంద్రబాబు నాయుడుకు ముక్కంటి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ నెల 25వ తేదీన ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాల సమర్పణకు రావాలని ఈ సందర్భంగా ముఖ్య మంత్రిని బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి కోరారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంగీకరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో ఎన్ఆర్ కృష్ణారెడ్డి, ఏఈవో హేమమాలిని, ఆలయ ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్, వేద పండితులు శివప్రసాద్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

అంగనవాడి కేంద్రాలకు దరఖాస్తులు ఆహ్వానం

– సిడిపిఓ పద్మ సునంద

విశాలాంధ్ర – కార్వేటినగరం : కార్వేటి నగరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని మూడు మండలాలకు కార్వేటినగరం, వెదురు కుప్పం, శ్రీ రంగరాజపురం మండలాలకు సంబంధించి అంగనవాడి కార్యకర్తలు, అంగనవాడి సహాయకురాలు ఉద్యోగాలు భర్తీ చేయుట కొరకు దరఖాస్తులు చేసుకోవాలని కార్వేటినగరం సిడిపిఓ పద్మ సునంద పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిడిపిఓ పద్మ సునంద మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకురాలు యొక్క నియామకం నిబంధనలను జతపరుస్తూ ఈ యొక్క దరఖాస్తును ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ఈనెల 12వ తేదీ నుండి 22వ తేదీ లోపు అందజేయాలని కోరారు. పెద్దహరిజనవాడలో ఏ డబ్ల్యు డబ్ల్యు, ఎస్సీ రోస్టర్66, వెదురు కుప్పం మండలం చిన్న పోటు చేను లో ఏ డబ్ల్యూ డబ్ల్యు ఎస్సీ 57, కార్వేటి నగరం మండలం ఆర్ కె బి పేట లో ఏ డబ్ల్యు హెచ్ సైకిల్ టు రోస్టర్ ఓసి 148, శ్రీ రంగరాజపురం మండలంలో సి.కె పురం లో ఏడబ్ల్యు హెచ్ సైకిల్ టు రోస్టర్ బి సి బి 110 కి కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రాజెక్ట్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చునని కోరారు.

ప్రధాని ప్రసంగం విద్యార్థులకు సోపానం

విశాలాంధ్ర – బుచ్చినాయుడు కండ్రిగ :– మార్చి మాసంలో జరిగే పదో తరగతి పరీక్షలలో ఒత్తిడిని అధిగమించడానికి భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో పరీక్ష పే చర్చ ప్రసంగం విద్యార్థులకు సోపానం కార్యక్రమ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యా యులకు కె. రమణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. మోడీ నేతృత్వంలో ఏడాది పి.పి.సి 2025 ఫిబ్రవరి 10వ తేదీన ఢిల్లీలోని భారత్ మండపం టౌన్ హాల్లో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సోషల్ మీడియా వేదికగా స్పెషల్ ఇన్విటేషన్ పలికారు. 'పరీక్షల సీజన్ వచ్చేసింది. పరీక్షా పే చర్చ ఈ ఏడాది కూడా మీ ముందుకొస్తోంది. అయితే ఈ సారి పరీక్షా పే చర్చ 2025 కార్యక్రమాన్ని కొత్త ఫార్మాట్లో సరికొత్తగా నిర్వహిస్తున్నాం. ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్థులను ఉత్సాహపరిచేందుకు, పరీక్షల ఆందోళన, ఒత్తిడిని అధిగమించడంలో సహాయపడటానికి విలువైన చిట్కాలతో సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో రెండవ మండల విద్యాశాఖ అధికారి ఆవల ముని సుబ్రహ్మణ్యం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాడిని ఖండించండి

(మొదటి పేజీ తరువాయి) సమాజం ముందుకు పోదని జస్టిస్ చిన్నప రెడ్డి వంటి న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పులు గుర్తు చేస్తున్నాయి. పుస్తకాలను నిషేధించడం సరికాదన్నప్పుడు, నిషేధించని పుస్తకాలను కూడా ఎలా ఈ మతోన్మాదులు ఎలా చించి పోగులు పెడతారు? నిజానికి పుస్తకాల్ని చించేసినంత మాత్రాన, అందులోని భావాల్ని చంపలేరు. ఈ చర్యలను నాగరిక సమాజం అంగీకరించదు. 'నూరు పువ్వులు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ' అన్నది పెద్దలు చెప్పిన సూక్తి. తిరుపతిలో ఈ ప్రదర్శనలో కవులు, రచయితలు, పుస్తక ప్రియులు పాల్గొని విజయవంతం చేయాలని పుస్తక ప్రియుల ఐక్య వేదిక కోరుతోంది. తమకు నచ్చిన పుస్తకాలను చేతప ట్టుకుని ఈ ప్రదర్శనలో పాల్గొనాలని వి జ్ఞప్తి చేస్తోంది.

శ్రీవారిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

విశాలాంధ్ర – తిరుమల కల్చరల్ : ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిన్ ధీరజ్ సింగ్ ఠాకూర్ సోమవారం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆల యం వద్ద టీటీడీ అదనపు ఈవో సి. హెచ్.వెంకయ్య చౌదరి ఆయనకు స్వాగతం పలికారు. దర్శనానంతరం రంగ నాయకులు మండపం వద్ద ఆయనకు పండితులు వేదాశీ ర్వచనం అందించగా అదనపు ఈవో స్వామివారి తీర్థ ప్రసా దాలు, చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డీఎల్వో వరప్రసాదరావు, డిప్యూటీ ఈవో లోక నాథం,పేష్కార్ రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించండి

-సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

విశాలాంధ్ర-తొట్టంబేడు: పేదలకు ఇళ్ల స్థలాలు వెంటనే కేటాయించాలని భారత కమ్యూనిస్టు పార్టీ తిరుపతి జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండు చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తొట్టంబేడు తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు మురళి ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పేదలందరికీ గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు వంతున ఇళ్ల స్థలాలు ఇస్తామని... అదేవిధంగా రూ.5లక్షలతో ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది మాసాలు దాటినా ఇంతవరకు ఈ హామీ నెరవేర్చలేదన్నారు. శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాల్లో సీపీఐ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు స్వీకరించగా... వందలాది కుటుంబాలు ఇళ్ల స్థలాల కోసం వేచి చూస్తున్నట్లు తేలిందన్నారు. ఇళ్ల కోసం దరఖాస్తు ఇచ్చిన వారి జాబితా తాము అధికారులకు అందజేస్తామన్నారు. పేదలకు సొంత స్థలం, ఇల్లు లేక పోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిరుపేదలు ఇళ్ల స్థలాల కోసం అధికారుల చుట్టూ నిత్యం తిరుగుతున్నప్పటికీ వారు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. అందుకే సీపీఐ ఆధ్వర్యంలో ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు మురళి చెప్పారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఎన్నికల హామీ నెరవేర్చాలన్నారు. లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ధర్నా అనంతరం తొట్టంబేడు తహసీల్దారు మధుసూదనరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ప్రాంతీయ కార్యదర్శి జనమాల గురవయ్య, తొట్టంబేడు మండల కార్యదర్శి రుద్రపాక శ్రీనివాసులు, ప్రజానాట్యమండలి జిల్లా నాయకురాలు చారుశీల, మండల నాయకులు నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలి :తహశీల్దార్

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలని తహసిల్దార్ సుబ్రహ్మణ్యం విద్యార్థులకు తెలిపారు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయుడు కె. రమణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో త్రివిక్రమరావు, తహసిల్దార్ సుబ్రహ్మణ్యం లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరము లో రెండు విడతలుగా జరిగేటువంటి జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ సందర్భంగా ప్రతి ఏడాది ఫిబ్రవరి 10 వ తారీఖున నిర్వహిస్తారన్నారు. మండలంలోని అంగన్వాడి కేంద్రాలలో ప్రభుత్వ, ప్రైవేట్, ఏకలవ్య గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో ఒక ఏడాది నిండిన పిల్లల నుండి 19 సంవత్సరం పిల్లల వరకు ఈ నులిపురుగుల నివారణ కు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ ను ఆశాల ద్వారా అంగన్వాడీ టీచర్ల ద్వారా ఏఎన్ఎం ద్వారా, ఎం.ఎల్.హెచ్.పీల ద్వారా మరియు ఉపాధ్యాయుల ద్వారా మధ్యాహ్నం భోజనం తరువాత నమిలి మ్రింగించడమైనది. ఈ కార్యక్రమంలో మొదటి మండల విద్యాశాఖ అధికారి కే రవీంద్రనాథ్, రెండవ మండల విద్యాశాఖ అధికారి ఆవల మునిసుబ్రహ్మణ్యం,వైద్యాధికారి డాక్టర్ దివాకర్, డాక్టర్ విద్యాసాగర్ ఆరోగ్య అధికారి డి ఎన్ వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మను దర్శించుకున్న టిడిపి నేత

విశాలాంధ్ర - పుంగనూరు:-మండలంలోని రాగానే పల్లి పంచాయతీ పరిధిలోని దండుపాల్యం లో గ్రామస్తుల చేత నూతనంగా నిర్మించబడిన బోయకొండ గంగమ్మ ఆలయానికి టిడిపి మండల పార్టీ అధ్యక్షులు మాధవరెడ్డి పార్టీ నాయకులతో కలిసి వచ్చి అమ్మవారు కు ప్రత్యేక పూజలు నిర్వహించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తుల ఆహ్వానం మెరుపు ఆలయా నికి రావడం జరిగిందని గ్రామస్తులు అడుగడుగునా ఘన స్వాగతం పలకడం చాలా సంతోషంగా ఉందన్నారు గ్రామంలోని ప్రజలందరికీ అమ్మవారు ఆశీ స్సులు నిండుగా ఉండాలని కోరుకోవడం జరిగింద న్నారు ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చైతన్య రాయల్ టిడిపి నాయకులు సుబ్రమణ్యం రాజు మనీ గంగాధర్ రమణ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ

విశాలాంధ్ర - పలమనేరు : శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి చేతుల మీదుగా పలువురు విద్యార్థులకు ఉచి తంగా కంటి అద్దాల పంపిణీ చేశా రు. జాతీయ అంధత్వ నివారణ సం స్థ ఆధ్వర్యంలో పట్టణంలోని బాలిక ఉన్నత పాఠశాల మరియు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశా లలలో ఈ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.... విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై శ్రద్ధ పెట్టగలరని కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు పలు కార్యక్రమాలను చేపడుతున్నాయ న్నారు. అందులో భాగంగా కంటిచూపు సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్ర మాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులు సెల్ఫోన్ వాడకం తో కంటి చూపును త్వరగా కోల్పోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నం దున సెల్ ఫోన్ వాడకాన్ని తగ్గించుకోవాలని సూచించారు. అనం తరం కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న పలువురు విద్యార్థినిలకు ఆయన కంటి అద్దాలను పంపిణీ చేశారు. నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ నులిపు రుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నులి పురుగు నివారణ మాత్రలైన ఆల్బెండజోల్ టాబ్లెట్లను ఈ సందర్భంగా ఆయన విద్యార్థినీలకు పంపిణీ చేశారు. అంతకుముందు నులిపురుగులతో తలెత్తే ఆరోగ్య సమస్యలపై అధికా రులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక విద్యార్థిని తప్పనిసరిగా ఆల్బెండజోల్ టాబ్లెట్లను తీసుకోవాలని ఎమ్మెల్యే విద్యా ర్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమాలలో పలమనేర్ కో-ఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్.వి.బాలాజీ, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ అర్పిత, ఎంఈఓ బాలసుబ్రమణ్యం, బాలికోన్నత పాఠశాల హెచ్ఎం లత, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, పీ. ఎం. ఓ.ఓ మధు, ఎం. పి. హెచ్.ఈ.ఓ జయశంకర్ మరియు టీడీపీ నాయకులు కుట్టి, గిరిబాబు, సుబ్రహ్మణ్యం గౌడ్, నాగరాజు, ఖాజా, చాంద్ బాషా, శ్రీధర్, కిరణ్, బీ ఆర్ సీ కుమార్, సుధాకర్, శంకరప్ప ఉన్నారు.

ఇల్లు లేని నిరుపేదలకు 3 సెంట్లు ఇంటి స్థలం నిర్మాణానికి

ఐదు లక్షలు మంజూరు చేయాలి

- ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఏ. తులసిరాజన్

విశాలాంధ్ర - ఏర్పేడు: మండలంలోని ఇల్లు లేని నిరుపేదలకు 3 సెంట్లు ఇంటి స్థలం మంజూరు చేసి ఇల్లు కట్టుకోవడానికి 5 లక్షల రూపాయలు ఉచితంగా మంజూరు చేయాలని ఏర్పేడు మండల తహసిల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ, బికెఎంయు ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది.కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఏర్పేడు మండలంలో అనేక గ్రామాలలో ఇల్లు లేని నిరుపేదలకు మూడు సెంట్లు భూమి, 5 లక్షల రూపాయలు నిర్మాణానికి ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని ఇప్పటికి 8 నెలలు కావస్తున్న ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా పేదలకు గూడు కల్పించాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు, ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఏ.తులసి రాజన్ కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఏర్పేడు తహసిల్దార్ శ్రీమతి భార్గవి గారికి పేదల అర్జీలను పరిష్కరించాలని విన్నవించు కున్నారు. తహసిల్దార్ సానుకూలంగా స్పందిస్తూ ఇల్లు లేని పేదలకు తప్పకుండా న్యాయం చేస్తామనన్నారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష ఆర్గనైజింగ్ కార్యదర్శులు బి. నాగభూషణం, డా.ఆర్ బలరాం, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి టి.మల్లికార్జున్, రమేష్, అయ్యప్ప, సంజాద్ బి తదితరులు పాల్గొన్నారు.

రహదారి నియమాలు పాటించాలి

-అసిస్టెంటు మేనేజరు చిట్టెమ్మ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: వాహన చోదకులు ప్రతి ఒక్కరూ రహదారి నియమాలు పాటించాలని శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో అసిస్టెంటు మేనేజరు చిట్టెమ్మ సూచించారు. రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ది స్కూల్ లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అసిస్టెంటు మేనేజరు చిట్టెమ్మ మాట్లాడుతూ... మద్యం, అధిక వేగం, ఓవర్ లోడ్ అనేవి రోడ్డు భద్రతకు ప్రమాద హేతువులన్నారు. రహదారి భద్రతా సూత్రాలు పాటించడం ద్వారా సురక్షిత జీవితాన్ని గడపవచ్చన్నారు. రహదారి నియమాలు పాటించడం వలన ప్రమాదాలు నివారించవచ్చన్నారు. ఈ కార్యక్ర మంలో ఆర్టీసీ డిపో సూపరింటెండెంట్ మారయ్య, ది స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పి.విశాల, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్లు, సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోండి:సిడిపిఓ

విశాలాంధ్ర - వి. కోట: వి. కోట మండలంలో బైరెడ్డిపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్లు, సహాయకుల పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఐసిడిఎస్ సిడిపిఓ అరుణశ్రీ తెలిపారు. వి. కోట మేజర్ పంచాయతీ పరిధిలోని నారాయణ నగర్, () ధర్మపురి, పాపేపల్లి, గాండ్లపల్లి ప్రాంతాలలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న ఖాళీలకు ఓపెన్ క్యాటగిరి కింద నియామకాలు గాను స్థానిక వివాహితులై పదవ తరగతి పాసైనవారు రోస్టర్ పద్ధతిలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు లు ఈ నెల 12 వ తేదీ నుండి 22 వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు బైరెడ్డిపల్లి లోని ఐసిడిఎస్ కార్యాలయంలో అందజేయాలని అన్నారు.

ప్రతి రైతు విశిష్ట గుర్తింపు నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర - సూళ్లూరుపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాష్ట్రం మూల లోని ప్రతి రైతుకు ఒక విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వాలని నిర్ణయించడమైనది. ఈ కార్యక్రమంలో భాగముగా 10వ తేదీ నుండి 28వ తేదీ వరకు ప్రతి రైతు సేవ కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులుచే "ఫార్మర్ రిజిస్టర్" పోర్టల్లో రైతు వివరాలను నమోదు చేయబడును.ఈ నమోదుకు ప్రతి రైతు విధిగా ఆధార్ కార్డు అడంగల్ లేదా 1బి మరియు ఆధార్ కార్డు లింక్ అయిన ఫోన్ నెంబర్ ఉన్న ఫోన్లను తమ వెంట తీసుకుని రావలెను. ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య లేకపోతే ప్రభుత్వము ద్వారా అందించే పథకాలైన పంటల బీమా, పి.ఎం కిసాన్, అన్నదాత సుఖీభవ,పంట నష్టపరిహారం మరియు వ్యవసాయ యంత్ర పరికల పై రాయితీలు పొందుటకు కుదరదని సూళ్లూరుపేట సహాయ వ్యవసాయ సంచారకులు జి.అనిత తెలియజేసినారు. కావున రైతులందరూ ఈ కార్యక్రమంలో భాగస్వామిగా నమోదు చేసుకోవాలని సూచించడమైనది. సూళ్లూరుపేట సబ్ డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 12,434 మంది రైతు కుటుంబాలను సూళ్లూరుపేట (4174), దొరవారిసత్రం (5272), తడ (2988) పీఎం కిసాన్ పథకము ద్వారా లబ్ధి పొందుచున్నారు.ఈ రైతులు రిజిస్టర్ చేయించుకొని పక్షంలో పీఎం కిసాన్ నిధులు జమ కావని జి.అనిత తెలియజేసినారు.

మదర్ థెరిసా పాఠశాల గ్రాడ్యుయేషన్ డే

విశాలాంధ్ర-పెద్దపంజాణి: మదర్ థెరిసా పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం డాక్టర్ ఖలీల్ ఉల్లా అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సందర్భంగా పాఠశాల కారస్పండెంట్ డాక్టర్ రవీంద్ర బాబు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసారు. కార్యక్రమం విద్యార్థుల జీవితంలో ఒక మైలురాయిగా నిలిచింది అని తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమం ప్రారంభంలో పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డేవిడ్ బెర్క్మాన్ స్వాగతోపన్యాసం ఇచ్చారు. వారు విద్యార్థుల శ్రద్ధ, కృషి, మరియు విజయాలను ప్రశంసించారు. విద్యార్థులు అద్భుతమైన సాంస్కృతిక ప్రదర్శనలు అందించారు కార్యక్రమం ముగింపులో డాక్టర్ ఖలీల్ ఉల్లా విద్యార్థుల భవిష్యత్తు కోసం శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల విద్యార్థుల సర్వాంగీణ వికాసానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంది అని తెలియజేసారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న జనసేన నేత!

విశాలాంధ్ర-పుంగనూరు: మండలంలోని చదల పంచాయతీ పరిధిలో ఉన్న గొల్లపల్లి సమీపాన గ్రామస్తులు ఏర్పాటు చేసిన అక్కదేవతల విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో అలాగే రాగానే పల్లి గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోయకొండ గంగమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనడానికి నియోజకవర్గ జనసేన నాయకులు ఎన్ వేణుగోపాల్ రెడ్డి విచ్చేయడంతో పార్టీ నాయకులు కార్యకర్తలు ఆలయ కమిటీ వారు ఆయనకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలకడం జరిగింది ఆయన రెండు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించుకుని స్వామివారిని కోరుకోవడం జరిగిందన్నారు. ఆలయాల అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో శివకుమార్ రెడ్డి మండల జనసేన అధ్యక్షులు విరుపాక్షి నరేందర్ రెడ్డి నారాయణ రెడ్డి చిన్న రాయల్ నరేష్ రాయల్ వెంకటరమణారెడ్డి భాస్కర్ రెడ్డి జైపాల్ రెడ్డి చిట్టి చిన్న తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త మృతికి పులివర్తి నాని నివాళి

విశాలాంధ్ర-పాకాల: పాకాల మండలంలో మృతి చెందిన టిడిపి కార్యకర్తకు చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని సోమవారం నివాళులర్పించారు. పాకాల మండలం లోని శంఖంపల్లి గ్రామ పంచాయతీ శంఖంపల్లి హరిజనవాడకు చెందిన కన్నయ్య మృతి చెందిన విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని స్థానిక నాయకులతో కలిసి కన్నయ్య పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



విశాలాంధ్ర-తడ: మండల పరిధిలోని పన్నంగాడు వద్ద జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని తమిళనాడు ప్రాంతానికి చెందిన సారంగం 55 మృతి చెందిన సంఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. తడ ఎస్ఐ కొండప్ప నాయుడు సమాచారం మేరకు సరిహద్దు రాష్ట్రమైన తమిళనాడు ప్రాంతం గుమ్మడిపూడి తాలూకా పెద్ది కుప్పం గ్రామానికి చెందిన సారంగం తడ మండల పరిధిలోని పన్నంగాడు వద్ద గల ఓ పరిశ్రమలో పనిచేస్తున్నారని పరిశ్రమకు నడిచి వెళుతుండగా బిజిఆర్ పరిశ్రమ ఎదురుగా చెన్నై నుండి నెల్లూరు వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అతని తలకు కాళ్లు మొండడానికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడని వారి కుమారుడు జగన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి: ఎమ్మెల్యే సునీల్ కుమార్

విశాలాంధ్ర-గూడూరు: అసత్య ప్రచారాలు మానుకోవాలని ఇది మంచి పద్ధతి కాదు అని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించారు. గూడూరు నియోజకవర్గంలో వైసీపీ కార్యకర్తలపై ఎటువంటి కక్ష సాధింపులు తాము ఎప్పుడూ చేయలేదని పేర్కొన్నారు. మంగళ పూరు గ్రామానికి చెందిన సతీష్ యాదవ్ అనే వ్యక్తి తెలుగుదేశం పార్టీ ఫ్లెక్సీలు చించివేసిన కేసులో అతనే పోలీసులకు లొంగిపోయాడని అతనిపై ఎవరు వేధింపులకు పాల్పడలేదని అన్నారు...ఈ క్రమంలో గూడూరు నియోజకవర్గం లోకి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఎందుకు వచ్చారో అర్థం కావడం లేదని తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో వైసీపీ హయాంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల పై కాకాణి వేధింపులు జరగలేదా అని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో గూడూరు నియోజకవర్గంలో ఎక్కడ అభివృద్ధి జరగలేదన్నారు. గూడూరుని తిరుపతిలో కలిపిన ఘనత వైసీపీ కే దక్కుతుందని, గూడూరుని తిరుపతిలో కలిపి నియోజకవర్గ ప్రజలకు అన్యాయం చేశారని ఎద్దేవా చేశారు. పోలీసు అధికారులపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని తెలిపారు. ఇప్పుడు ఉన్న పోలీసు యంత్రాంగమంతా వైసిపి హయంలో నియమించిన పోలీసులేనని ఆ విషయం కాకాణి గోవర్ధన్ రెడ్డి గుర్తుంచుకోవాలని అన్నారు. ఇకనైనా వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని ఆయన తెలిపారు. ప్రజలకు నీతి వంతమైన, న్యాయమైన పరిపాలన అందించడమే సిఎం చంద్ర బాబు లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నెలబల్లి భాస్కర్ రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర రాజు, అబ్దుల్ రహీం, మట్టం శ్రావణి రెడ్డి, వాటం బేడు శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండొజోల్ గుళికలపై ఆపోహలు వీడండి: డాక్టర్ హేమశ్రీ

విశాలాంధ్ర-కార్వేటినగరం: పిల్లల కడుపులో నులి పురుగులు సంక్రమిస్తే వారి ఎదుగుదల నిలిచిపోతుందని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ హేమశ్రీ అన్నారు. సోమవారం కత్తెరపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు గుళికలు వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ 19 లోపు పిల్లలపై నులిపురుగుల ప్రభావం అధికంగా చూపుతుందన్నారు. ముఖ్యంగా అపరిశుభ్రత, కలుషిత ఆహారం తీసుకోవడం, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన వంటి కారాణాల వల్ల నులిపురుగులు సంక్రమిస్తాయన్నారు. అలాగే పేగుల్లో మూడు రకాలైన ఏలిగపాము, కొంకిపురుగు, చుట్టపాము వంటి రకాలైన నులిపురుగులు సంక్రమించడానికి అవకాశం ఉందన్నారు. ఇది 5.5 అడుగుల వరకు పెరిగి 25 ఏళపాటు జీవిస్తాయని అన్నారు. ఇలాంటి నులిపురుగుల బారిన పడకుండా చేతిగోళ్లు కత్తెరించడం, పరిశరాలను శుభ్రంగా ఉంచుకోవడం కలుషిత ఆహారాన్ని తీసుకోకపోవడం ద్వారా నులిపురుగుల బారీ నుంచి తప్పించుకో వచ్చుని పేర్కొన్నారు. ఆల్బెండ్జోల్ గుళికల పట్ల అపోహలను వీడి ప్రతి ఒక్కరూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి నులిపురుగుల గుళికలు తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రభుత్వ డిగ్రీకళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల ఉన్నత పాఠశాల, ఆర్కేవీబీపేట, పాదిరికుప్పం, డీఎంపురం, కేఎం పురం, గంగమాంబాపురం, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు నులిపురుగుల మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది. విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

చదల్ల ఈద్గా ప్రహరీ పనులు ప్రారంభం

విశాలాంధ్ర-పుంగనూరు: కులమతాలకు అతీతమైన సమ సమాజం స్థాపించబడాలని మనుషులంతా ఒకే జాతిగా గుర్తించబడే రోజు ఎంతో దూరంలో లేదని జనసేన నియోజకవర్గ నాయకులు ఎన్వీఆర్ ట్రస్ట్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి ఆకాంక్షించారు. సోమవారం మధ్యాహ్నం మండలంలోని చదళ్ళ గ్రామంలో ఈద్గా ప్రహరీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలందరూ కుల మతాలు వేరైనా ఎంతో ఆప్యాయంగా బంధాలతో పిలుచుకుంటారని అన్నారు తనకు సమాజంలోని మనుషులు మాత్రమే ముఖ్యమని వారి కులాలు మతాలు అవసరం లేదన్నారు మసీదు పెద్దలు మాట్లాడుతూ చదల్ల లోని ఎటువంటి ఆదాయం లేని స్థితులలో వేణుగోపాల్ రెడ్డి మూడు గదులతో కూడిన వ్యాపార సముదాయాన్ని నిర్మించి ఇచ్చి, మసీదు ప్రగతికి తోడ్పడ్డారని వారు పేర్కొన్నారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

ఎంఈఓ మునిసుబ్రహ్మణ్యం

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: విద్యార్థులు కష్టపడి కాదు ఇష్టపడిచదివి తల్లి తండ్రుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని లక్ష్యంతో చదివితే సమాజములో మంచి ప్రయోజకులు కావాలని రెండవ మండల విద్యాశాఖ అధికారి ఆవల మునిసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు మండలంలో నెలవాయి, బి ఎన్ కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు సోమవారం ప్రీ ఫైనల్ పరీక్షలును రెండవ మండల విద్యాశాఖ అధికారి ఆవల ముని సుబ్రహ్మణ్యం పరిశీలించారు, ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు పదవ తరగతి విద్యా జీవితంలో మొదటి అడుగు దాన్ని సరిగా వేయడానికి విద్యార్థులు సమయపాలన పాటిస్తూ ఉపాధ్యాయులు బోధించిన అంశాలు సక్రమంగా నేర్చుకొని అందరూ ఉత్తమ మార్కులు సాధించాలన్నారు. విద్యతో పాటు క్రమశిక్షణ చాలా ముఖ్యమని క్రమశిక్షణ అలవర్చుకోవాలని తెలియజేశారు. కసిగా తీసుకోని లక్ష్యం పట్టుదలతో చదివితే ఉన్నత స్థానాలకు చేరుతారని హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవీంద్రనాథ్ రెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు పురుషోత్తం లు పాల్గొన్నారు.

ఘనంగా కాశీయాత్ర..

విశాలాంధ్ర-వి.కోట: మండల కేంద్రంలో వెలసిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం కాశీయాత్ర ఉత్సవం ఘనంగా నిర్వహించారు. మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు ఎస్. తిప్పరత్నం ఆచారి ఆధ్వర్యంలో స్థానిక వేణుగోపాల స్వామి గుడి నుండి బయలు దేరిన ఉత్సవంలో దేవతామూర్తులు భక్తులకు దర్శనమిస్తూ పట్టణ వీధుల్లో ఊరేగారు. అనంతరం యాత్ర వేణుగోపాల స్వామి ఆలయం చేరుకున్న అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రామ్మూర్తి ఆచారి, మురళీ ఆచారి, మాధవాచారి, శరవణాచారి తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు మద్యం షాపులు కేటాయింపు

విశాలాంధ్ర-చిత్తూరు: జిల్లాలోగీత కుల, ఉపకులాలకు రిజర్వ్ చేయబడిన మద్యం షాపులనులాటరీ విధానం తో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కేటాయించారు. జిల్లా వ్యాప్తంగా గీత కుల ఉపకులాలకు 10 మద్యం షాపులను కేటాయించారు. ఈ షాపులకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అధికారులు లాటరీ ద్వారా గీత కుల ఉపకులాలకు కేటాయించడం జరిగింది. సోమవారం డిఆర్డిఏ సమావేశపు మందిరంలో ఈ లాటరీ ప్రక్రియను నిర్వహించారు. గీత కుల, ఉపకులాల వారికి కేటాయించబడిన పది (10) మద్యము షాపులకు గానూ పెద్దపంజాని షాపు మినహా మిగిలిన తొమ్మిది షాపులలో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్, నగరి, పలమనేరు, పుంగనూరు మున్సిపాలిటీలకు ఒక్కొక్కటి చొప్పున, చిత్తూరు రూరల్ మండలము, గుడిపల్లి, పాలసముద్రం, వి.కోట, వెదురుకుప్పం మండలము షాపులను కేటాయించారు. ఈ లాటరీ ప్రక్రియ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టీ.విజయ్ శేఖర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, దరఖాస్తు దారులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి జి.శశి కుమార్

విశాలాంధ్ర-గూడూరు: కూటమి ప్రభుత్వ హామీ మేరకు పేదలకు వెంటనే ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి జి.శశి కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం గూడూరు పట్టణంలోని గాంధీ నగర్ ప్రాంతం నుండి సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అర్జీ దారులతో కలిసి గాంధీనగర్ సచివాలయం వరకు ర్యాలీగా బయలుదేరి, నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం అర్జీ దారులతో కలిసి సచివాలయ కార్యదర్శికి అర్జీలను అందజేశారు. సుమారు 150 మంది అర్జీదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, నియోజక వర్గ కార్యదర్శి జి.శశి కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిరు పేదలకు పట్టణంలో రెండు సెంట్లు, గ్రామంలో మూడు సెంట్లు ఇంటి స్థలాన్ని ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన పేదలకు ఇంటి స్థలాన్ని మంజూరు చేయాలని, అదేవిధంగా ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ పట్టణ కార్యదర్శి కాలేషా, ఏఐటీయుసి నియోజక వర్గ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గూడూరు పట్టణంలోని పది సచివాలయల్లో అర్జీదారులతో కలిసి అర్జీలను అందచేశారు. అనంతరం గూడూరు మండల పరిధిలోని విందూరు, రామలింగ పురం కండ్రిగలో అర్జీ దారులతో కలిసి సచివాలయం కార్యదర్శికి వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి జి.శశి కుమార్, ఏఐటీయుసి నియోజక వర్గ కార్యదర్శి నారాయణ, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు సునీల్, రాజ, రత్నయ్య, ముని, రూప తదితరులు పాల్గొన్నారు.

నులిపులు పురుగుల నివారణకు పరిశుభ్రత ఎంతో కీలకం

విశాలాంధ్ర-పుత్తూరు: 14 సంవత్సరాల లోపు పిల్లల్లో నులిపురుగుల వ్యాప్తిని అరికట్టి వారి భవిష్యత్తును రక్షించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 10వ తేదీని జాతీయ నులిపురు గుల నివారణ దినోత్సవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల పుత్తూరు లోని హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం జరిగింది. ఈ సభలో వైస్ ప్రిన్సిపాల్ వి.వీరయ్య మాట్లాడుతూ పిల్లలు బహిరంగ ప్రదేశాలలో మల మూత్ర విసర్జనకు వెళ్లరాదని, చెప్పులు లేకుండా తిరగరాదని, పండ్లు కూరగాయలను శుభ్రంగా కడిగి స్వీకరించాలని, అలాగే వీధి ఆహారాన్ని నివారించాలని, చేతులు, వంటగదులు, గోర్లను శుభ్రపరచు కోవాలని పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులలో నులిపురుగుల నివారణ కొరకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల హెల్త్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ జయప్రద, సభ్యులు డాక్టర్ షర్మిల, పద్మావతి, సావిత్రి మరియు హాస్పిటల్ వైద్య సిబ్బంది, అంగన్వాడీ ఆశా వర్కర్లు మౌన, హరిత, కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రైలు క్రింద పడి సర్పంచ్ ఆత్మహత్య

విశాలాంధ్ర-పుత్తూరు: నారాయణవనం మండలం భీముని చెరువు గ్రామ సర్పంచ్ మురుగేషన్ రజని (46) ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో పుత్తూరు పట్టణ పరిధిలోని మరాఠీ గేటు వద్ద రైలు క్రింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. రైల్వే పోలీసుల కథనం మేరకు రైల్వే ట్రాక్ సమీపంలో తన ద్విచక్ర వాహనంలో సెల్ ఫోను ఆధార్ కార్డు ఇతర వస్తువులను పెట్టి ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. చుట్టుపక్కల గ్రామస్తులు సోకసంద్రంలో మునిగి పోయారు. స్వగ్రామం నందు దహన కార్యక్రమాలు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జిల్లా ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్ కుమార్, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎన్.భాస్కరన్, మాజీ ఎంపీపీ గోవింద్ స్వామి, మాణిక్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు నివాళులర్పించారు.

లారీ కింద పడ్డ యువకుడు దుర్మరణం

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం కూడలి వద్ద జాతీయ రహదారిపై ప్రమాదవ శాత్తు లారీ కింద పడ్డ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పాతకాల్వ పంచాయతీ గాంధీనగర్ లో నివాసముంటున్న వేలు స్వామి కుమారుడు వినోద్ కుమార్ (23) తన ద్విచక్రవాహనంపై తిరుపతి నగరంకు వెళుతుండగా వేదాంతపురం వద్దకు రాగానే అదుపుతప్పి లారీకి వెనుక చక్రం కింద పడటంతో అతని కాలునుజ్జునుజ్జయింది. తీవ్ర రక్తస్రావం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన వినోద్ కుమార్‌ను పోలీసులు హుటా హుటిన 108 ద్వారా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని సోదరుడు పుష్పరాజ్ ఫిర్యాదు మేరకు ఎంఆర్ పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం హామీలను నిలబెట్టుకోవాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు డిమాండ్

విశాలాంధ్ర-చిత్తూరు: అర్హత కలిగిన ప్రతి పేదవారికి ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజ్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హత గల నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం చిత్తూరు తాసిల్దార్ కార్యాలయం ముందు సిపిఐ చిత్తూరు నగర సమితి నగర కార్యదర్శి బీసీ గోపీనాథ్ నాయకత్వంలో ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు అధికారంలోకి వస్తే నిరుపేదలకు అర్హత గల నిరుపేదలకు పట్టణాల్లో నగరాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇవ్వడంతో జరిగింది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు స్థలాలను పార్టీలకు, కుల, మతాలకు అతీతంగా ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో లబ్ధిదారులు సమీకరించి తాసిల్దార్ కార్యాలయం ముందు నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. ధర్నా అనంతరం చిత్తూరు మండల తాసిల్దార్, డిప్యూటీ తాసిల్దారుకు ఇళ్లస్థలాలు అర్జీలను సమర్పించారు. తాసిల్దార్ వెంటనే స్పందించి మీ దరఖాస్తులను వెంటనే విచారణకు చేపడుతామని తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కే.మణి, విసి గోపీనాథ్, కే.విజయ్ గౌరి, కే.రమా దేవి, ఎం.విజయ్ కుమార్, బి.కుమారి, ఏ.కవిత, పి.గజేంద్ర బాబు, లతా రెడ్డి, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి టిసి మహేష్ దేవయానితో పాటు పెద్ద ఎత్తున లబ్ధిదారులు పాల్గొన్నారు.

జిలిటన్ స్టిక్ పేలి ఒకరు మృతి

విశాలాంధ్ర-చిత్తూరు: చిత్తూరు బెంగళూరు జాతీయ రహదారి పనులు చేస్తుండగా జిలిటన్ స్టిక్ పేలి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చిత్తూరు సమీపంలో చోటు చేసుకుంది. గత కొంతకాలంగా చిత్తూరు బెంగళూరు జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రోడ్డుకు అడ్డంగా ఉన్న బండరాలను తొలగించే క్రమంలో డ్రిల్ చేసి అందులో జెలిటెన్ స్టిక్ అమర్చే క్రమంలో ప్రమాదవశాత్తు అది పేలిపోవడంతో నల్గొండ జిల్లాకు చెందిన ఆంజనేయులు (33) అక్కడికక్కడే మృతి చెందగా, యాదగిరి (44) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ యాదగిరిని వేలూరు సిఎంసి ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనలో మృతి చెందిన ఆంజనేయులు గాయపడ్డ యాదగిరి ఇరువురు అన్నదమ్ములు కావడం విశేషం. ఈ మేరకు చిత్తూరు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కుమ్మరులకు న్యాయం చేయండి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం ఇనగలూరుకు చెందిన కుమ్మరులకు న్యాయం చేయాలని ఆ కులం వారు విజ్ఞప్తి చేశారు. తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సంయుక్త కలెక్టరు శుభం బన్సల్ ను కలసి వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇనగలూరుకు చెందిన సుమారు 50 కుటుంబాల కుమ్మరులు కుండలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. తమకు వేరే జీవనాధారం లేదన్నారు. కుండలు తయారు చేసుకోవడానికి అవసరమైన బంక మట్టిని సుమారు 40ఏళ్లుగా ఇదే గ్రామ రెవిన్యూ పరిధిలోని సర్వే నంబరు: 150-1, 150-2లో నిల్వ చేస్తున్నామన్నారు. అయితే ఇటీవల ఈ గ్రామ రెవెన్యూ అధికారి ప్రభాకర్ రెడ్డి బంకమట్టి అక్కడ నుండి తొలగించాలని ఆదేశించారన్నారు. లేదంటే ఎక్కవేటరు సాయంతో బంక మట్టిని చదును చేస్తామని హెచ్చరించారన్నారు. అలా చేస్తే 50 కుమ్మరి కుటుంబాలు వలస వెళ్ళాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ఉన్నతాధికారులు మానవతా దృక్పథంతో ఆలోచించి తమకు న్యాయం చేయాలని వారు వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బెజవాడ రాష్ట్ర కుమ్మర, శాలివాహన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఆది శేషయ్య, తిరుపతి జిల్లా కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం అధ్యక్షులు గూడూరు వెంకటేశ్వర్లు, ఇనగలూరు సర్పంచ్ చెలికం నాగరాజు రెడ్డి, చిల్లకూరు శివకృష్ణ, ముచ్చేలి బాలకృష్ణ, ముచ్చేలి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్ సేవలపై అవగాహన కల్పించండి

విశాలాంధ్ర-తొట్టంబేడు: ప్రభుత్వ వాట్సాప్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తొట్టంబేడు మండల టీడీపీ అధ్యక్షులు గాలి మురళీనాయుడు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం తొట్టంబేడు తహసీల్దారు మధుసూదనరావు, ఎంపీడీవో సురేంద్రనాథ్‌ను వేర్వేరుగా కలిశారు. ఇంకా రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 12వ తేదీ వరకు గడువు ఉన్నందున ఈ అవకాశం ప్రజలు వినియోగించుకునే విధంగా ప్రచారం చేయాలని అధికారులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి: సిపిఐ

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు చొప్పున నిరుపేదలకు ఇచ్చి నిర్మాణం చేపట్టాలంటూ సిపిఐ సత్యవేడు నియోజకవర్గ నాయకుడు చిన్ని రాజ్ డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య అంబాకం చిన్ని రాజ్‌లు సందర్భంగా మాట్లాడుతూ నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని గత వైసీపీ ప్రభుత్వం హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో 1.5 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో ఒక సెంటు స్థలం పంపిణీ చేసి చేతులు దులుపు కున్నారని విమర్శించారు. ఇళ్ల నిర్మాణం కోసం 1.80 లక్షలు కేటాయించిందని, అది పునాదులకు కూడా సరిపోవడం లేదని విమర్శించారు. 2024 జరిగిన సార్వత్రిక ఎన్నికలలో భాగంగా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్ల నిర్మాణం కోసం 5 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందించారు. ఈ ధర్నాలో కారణి మిట్ట, వి ఎస్ పురం, కనమనంబేడు చెందిన మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. చింత పూడి రమణయ్య, షణ్ముగం, సుబ్రమణ్యం, చంద్రమ్మ, గోయిల్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ గుర్తింపు కార్డు కోసం రిజిస్టర్ చేయించుకోండి

విశాలాంధ్ర-సత్యవేడు: డిజిటల్ గుర్తింపు కార్డు కోసం మండలంలోని రైతులందరూ రిజిస్టర్ జాబితాలో వారి పేరును నమోదు చేయించుకో వాలని సత్యవేడు వ్యవసాయ మండల అధికారి మురళి కోరారు. సోమవారం స్థానిక ఆత్మ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో డిజిటల్ కార్డు మంజూరుపై వివరించారు. రైతులు వారికి సంబంధించిన రైతు సేవ కేంద్రాల వద్దకు వెళ్లి గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా రిజిస్టర్ చేయించుకోవాల్సి ఉందన్నారు. ఇందుకు రైతులకు సంబంధించిన ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధారుకు అనుసంధానించిన మొబైల్ ఫోను తీసుకెళ్లాలన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా రైతులకు సార్వత్రిక డిజిటల్ గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తుందంతన్నారు. డిజిటల్ గుర్తింపు కార్డులో విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటుందన్నారు. వీటి ఆధారంగానే పంటల బీమా, పీఎం కిసాన్ యోజన, పంట నష్ట పరిహారాలు, అన్నదాత సుఖీభవ, రైతులపై వ్యవసాయ యాంత్రిక పరికరాలు తదితర ప్రభుత్వ అమలు చేసే వ్యవసాయ పథకాలు వర్తిస్తుందన్నారు. ఫిబ్రవరి 28వ తేదీ లోపల రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు.

రైతులు విశిష్ట గుర్తింపు నమోదు చేసుకోండి

వి.జ్యోతమ్మ వ్యవసాయ అధికారి

విశాలాంధ్ర-చౌదేపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాష్ట్రంలోని ప్రతి రైతుకూ ఒక విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇవ్వాలని నిర్ణయించడం జరిగింది. ఇందులో భాగంగా ప్రతి రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్ నందు రైతు నమోదు కార్యక్రమం 10వ తేదీ నుండి చేపట్టడం జరుగుతుంది. దీని కొరకు మీ పేరు, ఊరు, ఆధార్ నంబర్, పట్టాదారు పాస్ బుక్కు, ఆధార్ కి లింక్ అయిన ఫోన్ నెంబర్ వివరాలను అందించాలి. నమోదు ప్రక్రియ పూర్తయ్యాక మీరు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందుతారు. దీనికి ప్రత్యామ్నాయంగా సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వివరాలు చెప్పండి. ఓటీపీ ద్వారా మీ నమోదు పూర్తి చేసుకోవచ్చు.

చెంగాలమ్మ దేవస్థానంలో దుకాణాలు బహిరంగ వేలం పాట

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: శ్రీ చెంగాలమ్మ పరమేశ్వరి దేవస్థానమునకు చెందిన వివిధ 8 లైసెన్సు హక్కులు 2025-26 సంవత్సరమునకు 1 సంవత్సర కాలమునకు యిచ్చుటకు గాను దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో బహిరంగ వేలం పాట నందు పూల అంగడి, పెళ్ళికలకు డెకరేషన్ చేసుకొను హక్కునకు రూ.7,41,000లకు హెచ్చు పాటపాడినారు. మిగిలి 7 హక్కులు వాయిదా వేయుట జరిగినది. దేవస్థానము నకు వివిధ 9 ఐటములు సరఫరా చేయుటకు గాను నిర్వహించిన సీల్డ్ టెండరు నందు పూలు సరఫరా చేయుటకు గాను-2, కూరగాయలు సరఫరా చేయుటకు గాను-3, ప్రింటింగ్ చేయుటకు గాను-2, వంటచెఱకు సరఫరా చేయుటకు గాను-2, ఎలక్ట్రికల్ గూడ్స్ మరియు శానిటరీవేర్స్ సరఫరా చేయుటకు గాను-2, పాలు, పెరుగు సరఫరా చేయుటకు గాను-3, పండ్లు సరఫరా చేయుటకు గాను-2 దాఖలు చేసియున్నారు. ఈ కార్యక్రమములో దేవాదాయ శాఖ, ఇన్స్పెక్టర్ . శ్రీనివాస బాబు పర్యవేక్షణలో, సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణా ధికారి బి. ప్రసన్నలక్ష్మీ, టెండరు దారుల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరుచుట జరిగినది.

పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు ఇప్పించాలి

విశాలాంధ్ర-పుత్తూరు: ఎంపీపీ స్కూల్ నారాయణవనం నందు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దర్శిత్ రాజు, మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్ రాజు, మండల నాయకులు భాస్కరన్ పిల్లలకు నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ 400 ఎంజి మాత్రలను మ్రింగించడం జరిగింది. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ పిల్లలకు తరచుగా కడుపునొప్పి రావడం రక్తహీనత సంభవించడం దీని వలన పిల్లలు పాఠశాలకు సక్రమంగా రాలేకపోవడం, చదువు పట్ల ఏకాగ్రత తగ్గడం జరుగుతుంది. అందువలన ప్రతి సంవత్సరము 6 నెలలకు ఒకసారి ఈ మాత్రలు నమలి మ్రింగి తినడం వలన ఈ నులిపురుగులను నిర్మూలించవచ్చునన్నారు. డిప్యూటీ ప్రభాకర్ రాజు మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్ మాట్లాడుతూ ఆరుబయట మలవిసర్జన చేయకుండా ఉండాలని భోజనానికి ముందు టాయిలెట్స్ పోయిన తర్వాత చేతులను శుభ్రంగా కడుకోవాలని తెలియజేశారు. భాస్కరన్ బోస్ మాట్లాడుతూ ప్రభుత్వము పంపిణీ చేసినటువంటి ఈ మాత్రలను ఉపయోగించుకోవడం వల్ల పిల్లలందరూ ఆరోగ్యంగా ఉంటారని తెలియజేశారు. శ్రీ చంద్ర ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, హెల్త్ సూపర్వైజర్లు, ఎం ఎల్ హెచ్ పి ఏఎన్ఎం అంగన్వాడి టీచర మరియు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పనిచేసే

పారిశుద్ధ్య కార్మికుల జీతాలను వెంటనే ఇవ్వాలి

- గూడూరు సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి జి.శశి కుమార్ డిమాండ్

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు వెంటనే ఇవ్వాలని గూడూరు సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి జి.శశి కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట పారిశుద్ధ్య కార్మికుల తో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి జి.శశి కుమార్ మాట్లాడుతూ గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పని చేసే 20 మంది పారిశుద్ధ్య కార్మికులకు గత ఆరు నెలలుగా జీతాలు ఇవ్వలేదు అన్నారు. వారు పస్తులు ఉంటూ జీవనం సాగిస్తున్నారు అన్నారు. వారి పిల్లలకు పాఠశాల ఫీజులు కట్టుకోలేక బడి మానేస్తున్నారు అన్నారు. గత మూడు ఏళ్లు నుండి పి.ఎఫ్ ఖాతాలోకి డబ్బులను జమచేయడం లేదన్నారు. వారికీ పని భద్రత కల్పించాలి అన్నారు. కాంట్రాక్ట్ మారినా ఇప్పుడు పనిచేస్తున్న కార్మికులను కొనసాగించాలి అన్నారు. ఇకనైనా ప్రతి నెల జీతం సక్రమంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం గూడూరు సబ్ కలెక్టర్‌కి పారిశుద్ధ్య కార్మికులతో కలిసి వినతి పత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో స్పోర్ట్స్ ఫెస్ట్

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీరాంనగర్ కాలనీలోని శ్రీచైతన్య పాఠశాలలో అంగరంగ వైభవంగా అందరిని ఆకర్షించే విధంగా చిన్నారులు స్పోర్ట్స్ ఫెస్ట్‌లో పాల్గొన్నారు. చిన్నారులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మార్చ్ పాస్ట్ (పరేడ్), ఒలంపిక్ టార్చ్, స్పోర్ట్స్ ఆఫ్ అని వివిధ రకాల ప్రదర్శనలు చేశారు. విచ్చేసిన తల్లిదండ్రులకు ఆటల పోటీలు, మాస్ డ్రిల్, ఏరోబిక్స్ నిర్వహించారు. తల్లిదండ్రులు వారి దైనందిన జీవితంలో నుండి ఈ కార్యక్రమం మంచి ఆటవిడుపును, ఆహ్లాదాన్ని ఇచ్చిందని ఆనందించారు. ప్రిన్సిపల్ రూపాదేవి మాట్లాడుతూ చిన్నప్పట్నుండే పిల్లల్లో నాయకత్వ లక్షణాలు, ఆటలపై ఆసక్తి, శారీరక ఉల్లాసం పెంపొందించడం చాలా అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏజిఎం సురేష్, ఇన్‌ఛార్జులు కల్పన, వాసంతి, సురేష్ రెడ్డి, ఉపాధ్యాయులు తనుశ్రీ, మేఘన, అనూష, లీల పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో కొనసాగుతున్న పింఛన్ల తనిఖీ

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో సామాజిక భద్రత పింఛన్ల తనిఖీ కొనసాగుతోంది. ఇందులో భాగంగా ప్రతిభవంతుల పింఛన్లను వైద్యులు పరిశీలిస్తున్నారు. స్థానిక ఎంపీడీవో చంద్రశేఖర్, వెలుగు ఏపిఎం డాక్టర్ డాంగే యాదవ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ సురేష్ పర్యవేక్షణలో పింఛన్ల తనిఖీ జరుగుతోంది. ఈ నేపథ్యంలో చంద్రగిరి కమ్యూనిటీ వైద్యశాల ఆర్థోపెడిషన్ డాక్టర్ పావన్ పింఛన్ల తనిఖీ చేస్తున్నారు. రోజుకు 50 కేసులను పరిశీలించి ప్రతిభవంతుల అంగవైకల్యాసాతాన్ని నమోదు చేయడం జరుగుతుంది. అర్హత లేని వారికి కూడా పింఛన్ సొమ్ము అందుతున్నట్టు ఆరోపణలు రావడంతో ప్రభుత్వం దీనిపై తనిఖీ చేపట్టింది. ఇప్పటికే మండలంలో పెరాలసిస్, డయాలసిస్ను సంబంధించి లబ్ధిదారులకు అందుతున్న పింఛన్ తనిఖీ పూర్తయ్యాయి. ఇప్పటివరకు అంగ వికలాంగులకు సంబంధించి 150 మంది లబ్ధిదారుల తనిఖీ పూర్తి చేయడం జరిగిందని ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ గోవర్ధన్, వెల్ఫేర్ అసిస్టెంట్ ముత్యాలయ్య, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు కోటీశ్వరి తదితరులు ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 15 మందికి జరిమానా

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: ప్రజలు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలి. అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీఎస్పి రామకృష్ణ ఆచారి కేసుల వివరాలు వెల్లడించారు. తిరుపతి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపిన డ్రైవర్ల పై ట్రాఫిక్ పోలీసు వారు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసి 15 మంది ముద్దాయిలను 4వ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు తిరుపతి నందు హాజరు పరచగా జడ్జి గ్రంధి శ్రీనివాస్ ఒక్కొక్కరికి 10 వేలు చొప్పున మొత్తం 15 మందికి 1,50,000 జరిమానా తిరుపతి ట్రాఫిక్ పోలీసుల పనితీరును జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు అభినందించినారు. తిరుపతి నగర ప్రజలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండ పోలీస్ సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠినచర్యలు

విశాలాంధ్ర-పాకాల: బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పి ప్రసాద్ హెచ్చరించారు. సోమవారం పాకాల మండలంలోని గ్రామాల చెరువు పరిసర ప్రాంతాలను డిఎస్పి పరిశీలించారు. పాకాలలో బహిరంగ ప్రదేశాలలో కొంతమంది ఆకతాయిలు మద్యం సేవిస్తూ అసాంఘిక చర్యలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు పాకాలలో బహిరంగ మద్య సేవిస్తున్న ప్రదేశాలను పరిశీలించామని దామలచెరువులోని మ్యాంగో నగర్, జాతీయ రహదారి పక్కన గల ముళ్లపొదలలో మద్యం సేవిస్తున్నట్లు సమాచారం ఉండడంతో దామలచెరువు పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి, పంచాయతీ సిబ్బందితో కంపచెట్లను, ముళ్ళపొదలను శుభ్రం చేసి అక్కడ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి హెచ్చరికలను జారీ చేశామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐ సుదర్శన్ ప్రసాద్, ఎస్సై సంజీవ రాయుడు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వార్డులో సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-వెంకటగిరి: 8వ సచివాలయం సుదర్శన్ నగర్ నందు ప్రజా విజ్ఞప్తుల రోజు జరపడం జరిగింది. ఇందులో భాగంగా స్థానిక 14వ వార్డు కౌన్సిలర్ ఆరి.శంకరయ్య ప్రజల దగ్గర నుంచి అర్జీలు స్వీకరించడం జరిగింది. దర్మపురం గవర్నమెంట్ స్కూల్ నందు పిల్లలకు నులిపురుగుల నివారణకు మాత్రలు పంపిణీ చేశారు. 14వ వార్డు నరసింహారావు విధిలో కుక్కలు విపరీతంగా సంచరిస్తున్నాయి. వాటి సంఖ్య సుమారు 30 పైగా ఉన్నవి. దీనివలన ప్రజలు రోడ్లమీద తిరగడానికి బయభ్రాంతులకు గురవుతున్నారు. కొందరుమీద దాడులు కూడా జరిగినవి. చిన్నపిల్లలను స్కూల్‌కి పంపలన్న, అడుకోవడానికి బయటకు రావాలంటే బయంగా ఉన్నది ఎక్కడ కుక్కలు పిల్లల మీద దాడి చేస్తాయో అని తల్లితండ్రులు బయభ్రాంతులకు గురి అవుతున్నారు. కుక్కలు పిల్లల నరసింహారావు విధిలో గల చింతల బుజ్జమ్మ అను ఆమెను అతి దారుణంగా దాడిచేసి రెండు చేతులను గాయపరచడమైనది. కుక్కలను చంపకూడదు అది నేరం అని అంటున్నారు. మరి నడిరోడ్డుపైన ప్రతిదినం మేకలను, పొట్టేలు, కోళ్లను చంపి అమ్ముతున్నారు. అవి కూడా జంతువులే కదా! మరి వాటివి ప్రాణమే కదా లేక కుక్కలు మాత్రమే ప్రాణం వుండే జంతువుల వాటి వలన మనుషులకు ఎంత ప్రమదమో తెలిసి కూడా మనం నిర్లక్ష్యంగా ఉంటే ఎలా. కుక్కల వలన ప్రజలు దాడులకు గురిఅవుతున్నారు. ఇప్పుడు కుక్కల నుండి మనుషులకు ప్రమాదం ఏర్పడితే, మనం కుక్కల గురించి ఆలోచించి మనుషులను ప్రాణాలను వదిలేస్తే ఎలా. పెద్ద వారిమీదే కుక్కలు దాడి చేస్తున్నాయి. మరి పిల్లల పరిస్థితి ఎలావుంటుందో ఆలోచించండి. కుక్కల నుండి ప్రజలను కాపాడండి. ఇది చిన్నవిషయంల కనబడుతున్న సమస్య మాత్రం చాలా పెద్దదే, కుక్కల బారినపడితే కానీ మనకు ఈ సమస్య అర్థం కాదు. ఈ సమస్యమీది స్పందించవలసినది కోరుతున్నాము.

ఇంటి స్థలాలు పంచాలని సిపిఐ ధర్నా

విశాలాంధ్ర-వెంకటగిరి: ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ సిపిఐ మరియు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయం దగ్గర ధర్నా చేయడం జరిగింది రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారం పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు మరియు గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు ఇంటి స్థలాన్ని ఇవ్వాలని ధర్నా జరిగింది. ధర్నాను ఉద్దేశించి సిపిఐ వెంకటగిరి నియోజకవర్గ కార్యదర్శి పి.బాలకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికి పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు ఇంటి స్థలాన్ని ఇచ్చి ఇల్లు నిర్మించుకొనుటకు 5 లక్షల రూపాయలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి కె.అంకయ్య పెట్టుకున్న ప్రతి అర్జీ ఎంక్వైరీ జరిపి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారుఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఏ.జయకృష్ణ మాట్లాడుతూ ఇళ్ల స్థలాలను సాధించుకునే వరకు కలిసికట్టుగా పోరాటం కొనసాగించాలని కోరారు. దళిత హక్కుల పోరాట సమితి వెంకటగిరి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కె.సెల్వ కుమార్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీలకు నివసించే ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రతి నిరుపేదకు ఇంటి స్థలాన్ని మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి దళిత హక్కుల పోరాట సమితి ఉపాధ్యక్షులు బి.నాగమణి వి.లక్ష్మి మరియు సుకుమారి రమణమ్మ బికెఎంయు నాయకులు ఢిల్లీ తులసమ్మ తదితరులు పాల్గొన్నారుధర్నా అనంతరం వెంకటగిరి మున్సిపల్ ఆఫీస్ మేనేజర్‌కి అర్జీలు సమర్పించడం జరిగింది వారు విచారణ జరిపి అర్హులైన వారికి ఇళ్ల స్థలాలను మంజూరు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది.

కల్తీ పసుపు, కుంకుమ విక్రయాలపై దాడులు

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్ : కల్తీ ఆహార పదార్థాలు విక్రయం చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని జిల్లా ఆహార భద్రత కంట్రోలర్ అధికారి వెంకటేశ్వర్ రావు పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు అలిపిరి ప్రాంతంలో, మెట్ల ప్రాంతంలో కల్తీ పసుపు, కుంకుమ ఆహార పదార్థాల విక్రయం జరుగుతోందని ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో జిల్లా ఆహార భద్రత కంట్రోలర్, ఫుడ్ సేఫ్టీ అధికారులు, మునిసిపల్ కార్పొరేషన్ అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అనుమానిత కల్తీ పసుపు, కుంకుమ విక్రయిస్తున్న వాటిని సీజ్ చేశారు, అలాగే వారికి అవగాహన కల్పించడం జరిగిందనీ ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు మద్దిలేటి, జగదీష్, మునిసిపల్ సతీష్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐరాల మండల కార్యాలయాల్లో అగ్నిప్రమాదం

విశాలాంధ్ర-చిత్తూరు: ఐరాల మండల తాసిల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో సోమవారం చోటు చేసుకున్న అగ్నిప్రమాదంలో కార్యాలయంలోని కంప్యూటర్లు ఇతర సామాగ్రి అగ్నికి ఆహుతి అయింది. సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరిస్తున్న క్రమంలో షార్ట్ సర్క్యూట్ తో ఒక్కసారిగా ఈ రెండు కార్యాలయాల్లో మంటలు చెలరేగాయి. ఈ రెండు కార్యాలయంలో పక్క పక్కనే ఉండడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కార్యాలయానికి వచ్చిన ప్రజలు పరుగులు తీశారు. ఈ అగ్ని ప్రమాదంలో రెండు కార్యాలయంలో ఉన్న కంప్యూటర్లో ఫ్యాన్లు స్విచ్ బోర్డులు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు తోపాటు ఇతర సామాగ్రి అగ్నికి ఆహుతి అయింది.

దామినేడు వద్ద కోర్టు భవనం!

రెవెన్యూ అధికారులతో కలసి స్థలమును పరిశీలించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్ : సోమవారం మధ్యాహ్నం తిరుపతి దామినేడు వద్ద కోర్టు భవనం ఏర్పాటు కొరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, చిత్తూరు ఉమ్మడి జిల్లా పోర్ట్ ఫోలియో అడ్మినిస్ట్రేషన్ హైకోర్టు జడ్జి బి. కృష్ణ మోహన్, జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, రెవెన్యూ డివిజనల్ అధికారి రామ్మోహన్ తో కలిసి హైకోర్టు భవన నిర్మాణం కోసం స్థలమును పరిశీలించారు. అనంతరం తిరుపతి రైల్వే స్టేషన్ నందు రాష్ట్ర హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ కి, చిత్తూరు ఉమ్మడి జిల్లా పోర్ట్ ఫోలియో అడ్మినిస్ట్రేషన్ హైకోర్టు జడ్జి బి. కృష్ణ మోహన్ కి తిరుపతి థర్డ్ ఏడిజే ఎం. గుర్నాథ్, ప్రోటోకాల్ జడ్జి కోటేశ్వర రావు, కోర్టు సూపరింటెండెంట్ ధనుంజయ్ నాయుడు తదితరులు వీడ్కోలు పలికారు.

గణపతినగర్‌కు రోడ్డు ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు మున్సిపాలిటి పరిధి లోని గణపతినగర్కు రోడ్డు ఏర్పాటు చేయాలని పలువు రు మహిళలు సోమవారం తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఇంటి పట్టాలు పొందిన 38 మందిలో 30 మంది ఇళ్లు నిర్మించుకొన్నారని, ఆరుగురు ఇళ్లు నిర్మించుకోలేదని, ఈ ఇళ్లకు సంబంధించిన రోడ్డును కొందరు ఫెన్సింగ్ వేసి ఆక్రమించుకొన్నారని ఆరోపించారు. సర్వే నిర్వహిం చి రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే పుత్తూరు మండలం నేసనూరు లెక్క దాఖలాలోని సర్వే నెంబర్ 186లోని సుందరయ్యనగర్ లో ఇళ్లు నిర్మించుకొని జీవిస్తున్న తమకు ఇళ్ల ధృవీకరణ పత్రాలు ఇవ్వాలని కోరుతూ పలువురు మహిళలు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ 3011లో ఇళ్లు నిర్మించు కొని నివసిస్తున్న తమకు ధృవీకరణ పత్రాలు ఇవ్వని కారణంగా తాము ఇంటి రుణాలను పొందలేకపోతున్నామని. ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేదని, ఇకనైనా తమకు ధృవీకరణ పత్రాలు ఇవ్వాలని లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. దీనిపై తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి పాల్గొన్నారు.

అర్హులకు ఇంటి స్థలాలు కేటాయించాలి

విశాలాంధ్ర-రేణిగుంట: ఇల్లు లేని పేదలకు రెండు సెంట్లు ఇంటి జాగా, గ్రామీణ ప్రాంతాలలో ఇల్లు లేని పేదలకు మూడు సెంట్లు భూమి ఎన్నికల హామీలలో ఇచ్చిన విధంగా అమలు పరచాలని లేనిపక్షంలో ఎర్రజెండా నాయకత్వంలో పేదలందరిని సమీకరించి భూ పోరాటం చేసి పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే బాధ్యతను ఎర్రజెండా తీసుకుంటుందని అలాంటి పరిస్థితులు రాష్ట్రంలో రానివ్వకుండా చంద్రబాబు కూటమి ప్రభుత్వం పేదల ఇళ్ల స్థలాల కోసం కృషి చేయాలి అని చిత్తశుద్ధితో ఇండ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టాలి అని సిపిఐ తిరుపతి జిల్లా కార్యవర్గ సభ్యులు కేతారి రాధాకృష్ణ అన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం రేణిగుంట తహసీల్దారు కార్యాలయం వద్ద జరిగిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గతంలో జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉండగా ఇచ్చిన పట్టాలు రద్దుచేసి అర్బన్ ప్రాంతంలో ఉన్న వారికి ఒక సెంటు రూరల్ ప్రాంతంలో ఉన్న వారికి ఒకటిన్నర సెంటు భూమిని కేటాయించడం అనేది దుర్మార్గమని ఆనాడే సిపిఐ ప్రశ్నించింది పోరాడిందని అందుకే ఆనాటి నుండి కనీసం రూరల్ ప్రాంతాల్లో మూడు సెంట్లు భూమి లేకుండా పేదవాడు జీవనం సాగించడం సాధ్యం కాదని అర్బన్ ప్రాంతాల్లో కనీసం రెండు సెంట్లు భూమి లేకుండా నివాసం కొనసాగించడం సాధ్యం కాదని ఆనాటి నుండి సిపిఐ గట్టిగా మాట్లాడుతుందని అన్నారు. ఇల్లు లేని పేదలందరూ ఎమ్మార్వోకి అర్జీలు ఇవ్వాలి అని మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలు జరుగుతున్నాయని అందులో భాగంగా రేణిగుంట మండలం నుండి పాల్గొన్న మీ అందరికీ సిపిఐ పార్టీ తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ శ్రీకాళహస్తి నియోజకవర్గం కార్యదర్శి వై ఎస్ మణి, మండల పార్టీ సెక్రటరీ మోహన్ రెడ్డి, పార్టీ కార్యవర్గ సభ్యులు కార్తీక్, రజాక్ మురళి భాను శెల్వా వినయ్, హరి, తరుణ్ రమణ, నాదముని, సుబ్బరాజు, చంద్రకళ, రమణ, పెంచలయ్య గంగ చిన్నగంగా కృష్ణమూర్తి షణ్ముగం ప్రసాద్ చాంద్ బేగం ఉమామహేశ్వరి అమ్ములు వసంతమరియు నాయకులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-పాకాల: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీ రుణాలను మహిళలందరూ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి పేర్కొన్నారు. పాకాల మండలంలో సోమవారం బయనపల్లి, ఉప్పర పల్లి పంచాయతీలలోని మహిళలతో సుధా రెడ్డి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ముఖాముఖి కార్యక్రమానికి విచ్చేసిన టిడిపి మహిళా నేత పులివర్తి సుధారెడ్డికి మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలోని వివిధ వర్గాల వారి అభివృద్ధి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సబ్సిడీ రుణాలను అందజేస్తున్నాయని మహిళలందరూ వీటిపై అవగాహన కల్పించుకోవాలన్నారు. మహిళలు పొదుపు సంఘాలతో ఏ విధంగా ఆర్థికంగా ఎదగవచ్చునో తెలియజేశారు. చంద్రగిరి నియోజకవర్గంలో మహిళలకోసం గార్మెంట్ ఫ్యాక్టరీ, స్వయం ఉపాధి కేంద్రంలో బ్యాగ్ ట్రైనింగ్ సెంటర్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పద్మజా రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ నాగరాజు నాయుడు సుబ్రమణ్య స్వామి దేవస్థానం ఛైర్మన్ చంద్రశేఖర్ నాయుడు, నాయకులు కే.సావిత్రి, ప్రసాద్ రావు, భరత్, కిరణ్, లతోపాటు అధిక సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంత లా కాలేజీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: న్యాయ శాస్త్రం అభ్యసించిన విద్యార్థులు పట్టభద్రులంతా సోషల్ ఇంజనీర్స్ అని సామాజిక భవిష్యత్తు అంతా వారి పైన ఆధారపడి ఉంటుందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎక్స్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై ఆర్ హరగోపాల్ రెడ్డి అన్నారు. స్థానిక మహతి కళాక్షేత్రంలో సోమవారం అనంత లా కాలేజీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎక్స్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై ఆర్ హరగోపాల్ రెడ్డి,అనంత లా కాలేజీ చైర్మన్ అనంత రవి, ప్రిన్సిపాల్ సి నటరాజారెడ్డి విచ్చేసారు. ఈ సందర్భంగా హర గోపాల్ రెడ్డి మాట్లాడుతూ న్యాయవృత్తి చాలా ఉత్తమమైనది అని, సామాజిక వ్యవస్థలో న్యాయ శాస్త్రం, న్యాయవాదుల ప్రాధాన్యతను ఆయన వివరించారు. అంతేకాకుండా న్యాయ విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు సంబంధిత చట్టాలను సమగ్రంగా అధ్యయనం చేయడంతో పాటు సామాజిక దృక్పథంతో పేదలకు న్యాయ సేవలను అందించేలా కృషి చేయాలని కోరారు. చైర్మన్ అనంత రవి మాట్లాడుతూ కాలేజీలో గడిపిన రోజులు మనందరికి అనేక జ్ఞాపకాలను సవాల్లును విజయాలను మిగిల్చాయి అని, కేస్ లా స్టడీస్ మూడ్ పోర్ట్ పోటీలు ఇంటర్న్షిప్ లు ఇవన్నీ మనను మంచి న్యాయవాదులుగా తీర్చిదిద్దాయి అని అన్నారు. న్యాయవాదిగా ఉండడం అంటే కేవలం ఒక ప్రొఫెషన్ కాదు ఇది సమాజానికి న్యాయం అందించాలని బాధ్యత మీపైన ఉందని తెలిపారు. ఈ పట్టా మన విజయానికి సూచిక మాత్రమే కానీ ఇది ఒక కొత్త ప్రయాణానికి కూడా నాంది అని తెలిపారు.న్యాయ రంగంలో నిజమైన మార్పును తీసుకురావాలంటే నిబద్ధత అంకిత భావం నిజాయితీ చాలా ముఖ్యమని డాక్టర్ అంబేద్కర్ మాటలు ప్రతి ఒక్కరు గుర్తించుకొని మెలగాలని న్యాయం కోసం పోరాడే మన ప్రయాణంలో ఎప్పుడు ధైర్యంగా ముందుకు సాగుదామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పట్టాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో అనంత ఎడ్యుకేషన్ సొసైటీ ఫౌండర్ మరియు ప్రెసిడెంట్ జయ రామయ్య, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే భాను ప్రకాష్

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు మండలం నేస్నూరు గ్రామపంచాయతీలో సోమవారం ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ రైతులకు ఎరువులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుల అభివృద్ధికి సంక్షేమానికి కృషి చేస్తుందని తెలిపారు యూరియా ధర 266 మాత్రమేనని తెలిపారు కార్యక్రమంలో ఏడిఏ రమేష్ రాజు పుత్తూరు వ్యవసాయ అధికారి కోదండయ్య ఇతర వ్యవసాయ శాఖ సిబ్బంది టీడీపీ నాయకులు రైతులు పాల్గొన్నారు.

ప్రయాణికుల అనుకూలంగా బస్సులు నడపండి

ఆర్టీసీ రీజనల్ చైర్మన్‌కు వినతి

విశాలాంధ్ర-కోట: ప్రయాణికులకు అనుకూలమైన సమయంలో బస్సులు నడపాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు, జిల్లా కోర్ కమిటీసభ్యులు పనబాక కోటేశ్వరరావు, దువ్వూరు గిరిధర్ రెడ్డి సోమవారం ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ చైర్మన్ నన్నపురెడ్డి సురేష్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోట వాకాడు చిట్టమూరు మండలం నుండి ప్రజలు హాస్పిటల్,ఆఫీస్, తదితర పనులు నిమిత్తం తెల్లవారుజామునే గూడూరు కి అక్కడ నుండి రైలు మార్గంలో చెన్నై,విజయవాడ బయలుదేరాల్సి ఉంటుందని అటువంటి వారికి ఇబ్బందులు లేకుండా వాకాడు డిపో నుండి ఉదయాన్నే బస్సులు రైల్వే స్టేషన్ వరకు నడపాలని అదేవిధంగా రాత్రి పది గంటలకు గూడూరు రైల్వే స్టేషన్ నుండి వాకాడు డిపోకి బస్సు ఏర్పాటు చేయాలన్నారు. గతంలో రూరల్ ప్రాంతాలకి నడపుతున్న బస్సులను తిరిగి ప్రారంభించాలని, నాయుడుపేట. కోట మార్గంలో తిరిగే పల్లె వెలుగు బస్సులన్నీ పాతపడిపోయి ఉన్నాయని వాటి స్థానంలో నూతన బస్సులు ఏర్పాటు చేయాలని వారు కోరారు.

ప్రతి అర్జీకి నాణ్యతగా పరిష్కారం చూపాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 249 అర్జీలు : జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కు అధిక ప్రాధాన్యత ఇస్తుందని (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నాణ్యతతో పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో జిల్లా జాయింట్ కలెక్టర్ అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీ ఏర్పా టుతో వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలను స్వీకరిం చారు. జిల్లాలోని డివిజన్, మండల స్థాయి వరకు ఆర్డీవోలు తాసి ల్దారులు, ఎంపిడిఓ లు తదితర అధికారుల వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానంతో అర్జీదారుల సమస్యలపై అధికారులతో అక్కడిక క్కడే వర్చువల్ విధానంలో మాట్లాడి పరిష్కారం చూపుతున్నారు. ఈ సందర్భంగా పీజిఆర్ఎస్ అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలి అని, పెండింగ్ అర్జీలను నిర్ణీత గడువులోగా అర్థవం తంగా పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమములో డిఆర్ఓ నరసింహులుతో పాటు డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, రోజ్ మాండ్, శివ శంకర్ నాయక్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదుతో అర్జీదారులకు రసీదులు అందించారు. శాఖల వారీగా అర్జీల వివరాలు : రెవెన్యూ -155, పంచాయత్ రాజ్ -27, డిసేబుల్డ్ వెల్ఫేర్ -1, పోలీస్ -13,మునిసిపల్ అడ్మినిస్ట్రేటివ్ -13, సర్వే అండ్ ల్యాండ్ -3, మైన్స్ అండ్ జువాలజీ -1, మెడికల్ హెల్త్ -4, ఏ.పి.ఎస్.ఆర్.టి.సి -1, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ -2, నేషనల్ హై వేస్ -3, ఆర్ బి -1, విద్యుత్ శాఖ -4, వాటర్ రిసోర్సెస్ -2, ఎస్సి వెల్ఫేర్ కార్పొరేషన్ -2,సివిల్ సప్లైస్ -4 , బి.సి కార్పొరేషన్ -1, ఆర్ డబ్ల్యు ఎస్ -1, ఐ.సి.డి.ఎస్ -1, సెర్ప్ -7, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ -1, సోషల్ వెల్ఫేర్ -1, ఫిషరీస్ -1, వెరసి మొత్తం 249 వినతులు రావడం జరిగిందని సంబంధిత అధికారులు అందరు వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి వేగవంతంగా పరిష్కరించాలని స్పందనకు హాజరయిన వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

నూతన బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గూడూరు: టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత గూడూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు 25 నూతన ఆర్టీసీ బస్సులను ప్రారంభిం చడం జరిగిందని గూడూరు రైల్వే స్టేషన్ నుండి పాత పద్ధతిలో తిరుమల కు బస్సులను పునః ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని ప్రయాణికు లకు మెరుగైన వసతులు అందాల చూస్తామని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్ సురేష్ రెడ్డి వెల్లడించారు. గూడూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద 9 నూతన ఆర్టీసీ బస్సులను ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్ సురేష్ రెడ్డి బస్సులకు పూజలు నిర్వహించి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత 25 నూతన ఆర్టీసీ బస్సులను గూడూరు నియోజకవర్గంలో ప్రారంభించడం జరిగిందని తెలిపారు. గతంలో గూడూరు రైల్వే స్టేషన్ నుండి తిరుమలకు బస్సు సౌకర్యం ఉండేదని గత వైసిపి ప్రభుత్వంలో తొలగించారని మరల వాటిని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అనంతరం ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా నూతన ఆర్టీసీ బస్సులు మంజూరు చేయడం జరిగిందని ఎప్పటికప్పుడు ప్రయాణికులకు మెరుగైన వసతులు సమకూరుస్తున్నామని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో ఆర్టీసీ సంస్థను నిర్వీర్యం చేశారని కూటమి ప్రభుత్వంలో ఆర్టీసీని అభివృద్ధి పథంలోకి తీసుకు వస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం నరసింహులు, నాయకులు, భాస్కర్ రెడ్డి పులిమి శ్రీనివాసులు వెంకటేశ్వర్లరాజు, రహీం, శివకుమార్, బాలకృష్ణ నాయుడు, లీలావతి, మట్టం శ్రావణి రెడ్డి, భారతి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

"జాతీయ రహదారిపై మురుగునీరు"

కథనానికి స్పందన

విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర - తడ : "జాతీయ రహదారిపై మురుగునీరు" పట్టించుకోని అధికారులు పాలకులు అనే శీర్షికకు తడ ఎంపీడీవో విజయ్ కుమార్ స్పందించి పంచాయతీ అధికారులను అప్రమత్తం చేసి మురుగునీరు రహదారిపై నిల్వ లేకుండా కాలువ త్రవ్వి మురుగునీరు కాలువలో పారేవిధంగా చర్యలు తీసుకొని బ్లీచింగ్ చల్లి పారిశుధ్యం పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవడం తో స్థానిక వ్యాపారస్తులు హర్షం వ్యక్తం చేశారు. జాతీయ రహదారి అధికారులు శాశ్వత కాలువ నిర్మించక పోవడంతోనే మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. జాతీయ రహదారి సిబ్బంది పారిశుధ్యం విషయం లో ఉదాసీనత కారణం గానే రహదారి వెంబడి చెత్త పేరుకుపోవడం కాలువలలో మురుగునీరు అక్కడక్కడ నిల్వ చేరే పరిస్థితి కలుగుతోందని పలువురు స్థానిక ప్రజలు అంటున్నారు. జాతీయ రహదారి సిబ్బంది చేయవలసిన పారిశుధ్యం పనులను కూడా పంచాయతీ పాలకులు చేయవలసిన పరిస్థితి కలుగుతోంది.గ్రామాలలో ఎక్కడ పారిశుధ్యం త్రాగునీటి సమస్య ఉన్నా తడ ఎంపీడీవో దృష్టి కి వెళ్తే వెంటనే స్పందించి సమస్యను పరిష్కరిస్తున్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజల నుండి 95 ఫిర్యాదులు

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : సోమవారం నాడు జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఐపిఎస్., జిల్లా కార్యాలయం నందు ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని, నేరుగా ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించినారు. సదరు ఫిర్యాదులను సంబంధ పోలీస్ స్టేషన్ కు పంపించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి కె.రవి మనోహరాచారి పరిపాలన, అదనపు ఎస్పీ నాగభూషణం క్రైమ్ వారు, జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి, వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపినారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీస్ స్టేషన్లో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చును. ఆ ఫిర్యాదులను మీకోసం - ప్రజా సమస్య పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో సత్వర న్యాయం చేయడం జరుగుతుంది.

తనపై దాడిని లోక్‌సభలో ప్రస్తావించిన తిరుపతి ఎంపీ

- స్వతంత్ర దర్యాప్తు చేయాలని గురుమూర్తి డిమాండ్

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ :- ప్రజా ప్రతినిధులపై జరుగుతున్న భౌతిక దాడులపై భద్రత చర్యలు పటిష్టపరచాలని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి సోమవారం జరిగిన లోక్ సభ బడ్జెట్ సమావేశంలో ప్రస్తావనకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా తిరుపతి ఎంపీ మద్దిల డాక్టర్ గురుమూర్తి మాట్లాడుతూ తిరుపతి డిప్యూటీ మేయర్ ఉప ఎన్నిక సందర్భంలో ఓటింగ్‌కు వెళ్లే సందర్భంలో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో తనతో పాటు మేయర్ డాక్టర్ శిరీష, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యంతో పాటు వైసీపీకి చెందిన కార్పొరేటర్లపై భౌతికదాడులకు పాల్పడినట్టు తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి తెలిపారు. లోక్‌సభలో బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ప్రత్యేక ప్రస్తావన 377 కింద ఆయన మాట్లాడుతూ హింస గురించి ప్రస్తావించడం గమనార్హం. డిప్యూటీ మేయర్ ఎన్నికలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎమ్మెల్సీ, నగర మేయర్, కార్పొరేటర్లతో కలిసి తాను ప్రయాణిస్తున్న వాహనంపై దాడి జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్య విరుద్ధమైన సంఘటన అని అన్నారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కారన్నారు. తమపై దాడి అప్రజాస్వామ్యం అని ఆయన సభ దృష్టికి తీసుకెళ్లారు. ఈ దాడి సమయంలో తమ వాహనంలో మహిళా కార్పొరేటర్లు కూడా ఉన్నారని, వారు తీవ్ర భయాందోళనలకి లోనయ్యారని తెలిపారు. తాము ప్రయాణిస్తున్న వాహనంపై దాడి జరిగే సమయంలో పోలీసులు ఉన్నా, రక్షించాల్సింది పోయి, ప్రేక్షక పాత్ర పోషిస్తూ, చోద్యం చూస్తూ నిలబడ్డారని ఎంపీ ఆరోపించారు.ఈ సంఘటనపై ఇప్పటి వరకు జిల్లా పోలీసు యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోలేదని సభ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా ప్రతినిధుల భద్రతను నిర్లక్ష్యం చేస్తూ, నేరస్తులకు అండగా వ్యవహరించడం పూర్తిగా అన్యాయమని తిరుపతి ఎంపీ గురుమూర్తి పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులపై ఇలా హింసాత్మక దాడులు జరగడం ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరం అన్నారు. తక్షణమే ఈ ఘటనపై స్వతంత్ర దర్యాప్తు సంస్థ ద్వారా విచారణ జరిగేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, నిందితులను కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే ఇలాంటి చర్యలను ఉపేక్షించకూడదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు... కలుగుతోందన్నారు.

నులిపురుగు నివారణ మందుల పంపిణీ

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్ : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా దామినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రము, పద్మావతి పురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులు అందరికీ జాతీయ నులిపురుగుల నివారణ వార్షికోత్సవాల్లో భాగంగా ఆల్బెండజోల్ నులిపురుగు నివారణ మాత్రలు విద్యార్థిని, విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ ప్రసంగిస్తు జిల్లాలో 4,91,714 మంది విద్యార్థులకు 6542 కేంద్రాలలో కడుపు లో ప్రేవులలో ఉన్న నులి పురుగుల నిర్మూలన కై ఆల్బండజోలు మాత్రలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులలో రక్తహీనతను తగ్గించి ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలపారు. అలాగే సోమవారం నాడు పాఠశాలకు గైర్హాజరైన పిల్లలకు 17వ తారీఖున మాప్ అప్ డే రోజున ఆల్బెండజోల్ మాత్రలు ఇస్తారని ఆయన తెలిపారు. సంవత్సరం వయసు నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మందు బిళ్ళలను విద్యార్థులకు అంగన్వాడి కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల యందు ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, స్కూల్ టీచర్లు సమన్వయంతో అందించడం జరుగుతుందని డిఎంహెచ్ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లలకు రక్తహీనత గురించి, పర్సనల్ హ్యాండ్ వాషింగ్ గురించి, నులిపురుగుల నివారణ గురించి, అలాగే బహిరంగ మల విసర్జన చేయరాదని అందరు కూడా టాయిలెట్స్ వాడుకోవాలని తదితర విషయాలు పై ఆరోగ్యం, విద్య బోధన గురించి విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఓ బాలాజీ, ఆర్బిఎస్కె ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, దామినేడు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉదయశ్రీ, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ మురళి కృష్ణ, డిప్యూటీ డెమోలు భానుమూర్తి, కిరణ్ కుమార్ లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ హరిప్రియ, ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
విలేకరులు కావలెను
విశాలాంధ్ర తెలుగు జాతీయ దినపత్రికలో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో
దిగువ తెలిపిన మండలాల్లో పనిచేయుటకు స్థానికంగా ఉన్న అభ్యర్థులు కావలెను.
ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, తెలుగుభాషపై పరిజ్ఞానం ఉండాలి.
పనిచేయవలసిన మండలాలు :
తిరుపతి, నాయుడుపేట, పిచ్చాటూరు, నాగలాపురం, నగరి, డక్కిలి, సదుం,
పూతలపట్టు, ఐరాల, తవణంపల్లి, యాదమరి, బైరెడ్డిపల్లె, శాంతిపురం,
గుడుపల్లె, చిత్తూరు రూరల్, పాలసముద్రం
గమనిక: ఆయా మండలాల్లో స్థానికులై ఉండాలి
సంప్రదించవలసిన నెంబరు: 94909 52134